

భారీ పుచ్చకాయ

హొళగుంద: సాధారణంగా పుచ్చకాయ 9 నుంచి 11 కిలోల వరకు ఉంటుంది. అయితే హొళగుందలో ఓ వ్యాపారి వద్ద 16 కేజీల పుచ్చకాయ సోమవారం కనిపించింది.



అలరించిన నాదామృతం

శ్రీశైలం టెంపుల్: నిత్యకళారాధన వేదికపై సోమవారం నెల్లూరుకు చెందిన జె. వెంకట సురేష్ బృందం నిర్వహించిన నాదామృతం కార్యక్రమం అలరించింది.



శాస్త్రోక్తంగా సహస్రదీపార్చన

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం సహస్రదీపార్చన సేవ నిర్వహించారు. ఉత్సవమూర్తులను వెండిరథంపై ఉంచి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:35	ఉ॥ 4:46
ఆదోని	సా॥ 6:38	ఉ॥ 4:49
నంద్యాల	సా॥ 6:35	ఉ॥ 4:43
ఆత్మకూరు	సా॥ 6:33	ఉ॥ 4:44
బనగానపల్లె	సా॥ 6:36	ఉ॥ 4:44

హదీస్ వెలుగు :

చాడీలు చెప్పడం, ఇద్దరి మధ్య గిల్లలు పెట్టి వారిని దూరం చేయడం, బంధువుల మధ్య సంబంధాలు తెంచడం చాలా పాపం. ఇలాంటి వాటి పట్ల దూరంగా ఉండండి. – పవిత్ర ఖురాన్

న్యూస్‌రీల్

కర్నూలుకు నీటి కొరత లేదు

- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరానికి నీటి కొరత ఏమీ లేదని, ప్రతి రోజూ 50 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నామని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన సీఎస్ జవహర్‌రెడ్డికి వివరించారు. సోమవారం విజయవాడ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తాగునీరు, ఉపాధి హామీ పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పరిస్థితులను కలెక్టర్ సీఎస్‌కు వివరించారు. గాజులదిన్నె ప్రాజెక్టులో 1.2 టీఎంసీల నీరు ఉందని, కెనాల్ సామర్థ్యం తక్కువగా ఉండడంతో రోజూ 30 క్యూసెక్కుల నీటిని తీసుకుంటున్నట్లు చెప్పారు. అలాగే సుంకేసుల నుంచి 20 క్యూసెక్కుల నీటిని తీసుకుంటున్నామని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖర రెడ్డి, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'కోడ్' అమలుకు పటిష్ట చర్యలు

- ఎంసీసీ నోడల్ అధికారి జీ నాసరరెడ్డి

కర్నూలు(అర్బన్): జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన ఆదేశాల మేరకు జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు పటిష్ట చర్యలు చేపట్టినట్లు మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ (ఎంసీసీ) నోడల్ అధికారి, జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గత నెల 16వ తేది నుంచి 31వ తేది వరకు పబ్లిక్ ప్రదేశాల్లో అనధికారికంగా ఏర్పాటు చేసిన 16,735 గోడ రాతలు, పోస్టర్లు, బ్యానర్లను తొలగించామన్నారు. అలాగే ప్రైవేటు ప్రదేశాల్లో అనధికారికంగా ఏర్పాటు చేసిన 7,973 బ్యానర్లు, పోస్టర్లు, గోడలపై రాతలను తొలగించామన్నారు. మార్చి 31న పబ్లిక్, ప్రైవేటు ప్రదేశాల్లో అనధికారికంగా ఏర్పాటు చేసిన 178 పోస్టర్లు, బ్యానర్లను తొలగించామన్నారు. సీ విజిల్ యాప్‌లో ఇప్పటి వరకు 123 ఫిర్యాదు రాగా, 82 సహేతుకమైన ఫిర్యాదులపై విచారించి 70 ఫిర్యాదులను పరిష్కరించామన్నారు.

పెరిగిన విద్యుత్ వినియోగం

- డిమాండ్‌కు తగినట్లు సరఫరా చేస్తున్న విద్యుత్ శాఖ

కర్నూలు(అగ్రికల్చర్): ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో విద్యుత్ వినియోగం కూడా అధికమైంది. అయితే డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ శాఖ ఏర్పాట్లు చేసింది. ఉక్కపోత కారణంగా ఫ్యాన్, కూలర్లు, ఏసీలు లేకుండా ఉండలేని పరిస్థితి. 2023 మార్చి 31న ఉమ్మడి కర్నూలు జిల్లాలో 734 మెగా వాట్ల విద్యుత్ వినియోగించారు. 2024 మార్చి 31న విద్యుత్ వినియోగం 790 మెగా వాట్లకు పెరిగింది. అంటే 56 మెగా వాట్ల వినియోగం పెరిగినట్లు స్పష్టమవుతోంది. రానున్న రోజుల్లో ఎండలు, వడగాలుల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇందుకు అనుగుణంగా విద్యుత్ వినియోగం పెరుగుతుందని విద్యుత్ అధికారులు అంచనా వేశారు. డిమాండ్‌కు అనుగుణంగా ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తామని ఎస్ఈ ఉమాపతి తెలిపారు.

సేవలు తొలగి... వేదన మిగిలి!

మంచానికే పరిమితమైన ఈ వృద్ధురాలి పేరు కురువ లింగమ్మ. పెద్దకడబూరు మండలం మేకడోణ గ్రామానికి చెందిన ఈమె కుమారుడి వద్ద ఉంటోంది. వ్యవసాయ పనులు చేసుకునే కుమారుడు.. పింఛన్ డబ్బులతో ఈమెకు వైద్యం చేయిస్తున్నాడు. ప్రతి నెలా ఒకటో తేదీన వలంటీర్ వచ్చి పింఛన్ ఇస్తుండటంతో తమకు ఎలాంటి కష్టాలు ఉండేవి కాదని చెబుతున్నాడు. ప్రస్తుతం సచివాలయానికి వెళ్లాలంటే పనులు మానుకోవాలని, అక్కడ పింఛన్ తీసుకోవడానికి ఎన్ని రోజులు తిరగాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. చంద్రబాబుకు ముసలోళ్ల ఉసురు తప్పదని కన్నీటి పర్యంతమయ్యాడు. – పెద్దకబూరు



- వలంటీర్లపై టీడీపీ అక్కసు
- పింఛన్ల పంపిణీకి దూరం చేసిన వైనం
- మండిపడుతున్న పింఛన్ లబ్ధిదారులు
- కరోనా సమయంలో సేవలు గుర్తు చేసుకుంటున్న ప్రజలు
- ఓటుతో బుద్ధి చెబుతామని హెచ్చరిక

కర్నూలు(అగ్రికల్చర్): పింఛన్ల పంపిణీ, ఇతర సంక్షేమ కార్యక్రమాల అమలులో గ్రామ, వార్డు వలంటీర్లను దూరం చేయడం పట్ల సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. పింఛన్ల పంపిణీలో వలంటీర్లను పక్కన పెట్టడం... సచివాలయాలకే వెళ్లి పింఛన్ పొందాల్సి రావడంతో అవ్వాతాతలు, దివ్యాంగులను తీవ్ర వేదనకు గురి చేస్తోంది. మళ్లీ టీడీపీ హయాంలో పరిస్థితులే ఉత్పన్నం అవుతుండాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 20 వేల మందికిపైగా వలంటీర్లు ఉన్నారు. మొదటి నుంచి వారిపై టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ విషయం చిమ్ముతున్నారు. వీరిని పింఛన్ల పంపిణీకి దూరం చేయడంపై అంతటా ఆగ్రహం వ్యక్తమవుతోంది. 43–44 డిగ్రీల ఉష్ణోగ్రతల్లో సచివాలయాలకు వెళ్లి వృద్ధులు, దివ్యాంగులు పింఛన్ ఎలా తీసుకుంటారనే ప్రశ్న ఉదయిస్తోంది. ఎన్నికల ముందే పింఛన్‌దారులకు ఇన్ని కష్టాలు తెచ్చిపెడితే... పొరపాటున టీడీపీ ప్రభుత్వం వస్తే మన పరిస్థితి ఏమిటి చాలా మంది ప్రశ్నిస్తున్నారు.

కరోనా సమయంలో స్వచ్ఛంద సేవలు..

రెండేళ్ల పాటు కరోనా రక్కసి జిల్లాను ఉక్కిరిబిక్కిరి చేసింది. లాక్‌డౌన్, కర్ఫ్యూతో కరోనా సమయంలో పడిన కష్టాలు అన్నీఇన్నీ కావు. అంతటి తీవ్రమైన పరిస్థితుల్లో వలంటీర్లు స్వచ్ఛంద సేవలు అందించారు. కోవిడ్ టెస్టులు చేయించడం, పాజిటివ్ వచ్చిన వారిని క్వారంటైన్‌లకు తరలించడం, నెగిటివ్ వచ్చిన వారిని ఇళ్లలోనే ఉంచడం చేశారు. కరోనా సమయంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ఇచ్చిన రూ.వెయ్యి ఆర్థిక సాయాన్ని అందించారు. సరుకులు, రైస్, మాస్క్‌లు కూడా పంపిణీ చేశారు. ఇంటింటికి తిరిగి అనుమానాస్పదులను గుర్తించి కోవిడ్ పరీక్షలు నిర్వహించడంలో ప్రధాన భూమిక పోషించారు. వలంటీర్ల నిస్వార్థ సేవ కార్యక్రమాలతో కరోనా నుంచి గట్టెక్కామనే అభిప్రాయం ఎవరూ కాదనలేని నిజం.

ఉసురు తగులుతుంది

'మంచి చేయరు... మంచి చేసే వారిని సహించరు.. మీ హయాంలో అంతంతమాత్రం చెల్లించే పింఛన్ పొందడం కోసం ఎన్నో కష్టాలు పడ్డాం.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాత పింఛన్ కష్టాలను మరచిపోయాం. మళ్లీ మీ కారణంగా కష్టాలు చుట్టుముడుతున్నాయి' అని పింఛన్‌దారులు వాపోతున్నారు. తమ ఉసురు తగులుతుందని వృద్ధులు, దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అవినీతికి తావులేకుండా పథకాల అమలు

టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు ప్రజల రక్త మాంసాలను పీల్చి వేశాయి. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం తెచ్చిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఎక్కడా అవినీతి, అక్రమాలకు తావు లేకుండా, రాజకీయాలు, కులమతాలకు అతీతంగా వలంటీర్లు సంక్షేమ పథకాలు అమలు చేశారు. పథకాల కోసం ప్రజలు సచివాలయాల చుట్టూ తిరుగలేదు. మండల స్థాయి కార్యాలయాలకు వెళ్ల లేదు.. కానీ అర్హత కలిగిన వారందరికీ పథకాలు అమలయ్యాయి. ఇందుకు వలంటీర్లే కారణం. వలంటీర్ వ్యవస్థతో అన్ని వర్గాల ప్రజలకు మంచి జరుగుతుండటం, తద్వారా ప్రభుత్వానికి మంచి పేరు వస్తుండటం చంద్రబాబు, అతని అనుయాయులు తట్టుకోలేక ఎన్నికల సమయంలో వారి సేవలను ప్రజలకు దూరం చేశారు.



ఈ చిత్రంలో ఉన్న బాలిక పేరు గీత. మానసిక స్థితి సరిగా లేని దివ్యాంగురాలు. కౌతాళానికి చెందిన బాలికకు తండ్రి ఈరన్న సపర్యలు చేస్తున్నారు. ప్రతి నెలా ఒకటో తేదీ ఈ బాలికకు వలంటీర్ వచ్చి పింఛన్ ఇచ్చేవారు. ఈ డబ్బుతో ఈరన్న మందులు కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం పింఛన్ కోసం సచివాలయాల వద్దకు వెళ్లాలని చెప్పడంతో ఈరన్న ఆవేదన వ్యక్తం చేసున్నాడు. తన కుమార్తె నడవలేదని, ఎత్తుకుపోవాలని, అక్కడ పింఛన్ తీసుకోవడానికి ఎన్నికష్టాలు పడాలో అని ఆందోళన చెందుతున్నాడు. –కౌతాళం



కుమార్తెను పట్టుకుని నడిపిస్తున్న ఈమె పేరు లక్ష్మి. కోసిగి కడపాళెం వీధిలో నివాసం ఉంటున్నారు. ఈమె కుమార్తె రామచంద్రమ్మకు కళ్లు కనిపించవు. మాటలు రావు, కూర్చోలేదు, నడవలేదు. ఎప్పుడూ మంచానికే పరిమితమై ఉంటుంది. పట్టుకుని నడిపిస్తే అయిదు అడుగులు వేస్తోంది. అంతలో ఏడ్చేస్తుంది. నరాలు బలహీనంగా ఉండడంతో బయోమెట్రిక్ ద్వారా పింఛన్ తీసుకోవడానికి చేతి వేళ్లు పడవు. ఈ దివ్యాంగురాలికి ఆర్‌బీఎస్ ద్వారా ప్రతి నెలా వలంటీర్ ఇంటికి వెళ్లి రూ.3వేలు పింఛన్ అందజేస్తున్నారు. ఈ నెల పింఛన్ ఎలా తీసుకోవాలని తల్లి లక్ష్మి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – కోసిగి

'స్వచ్ఛంద' మనసుకు గాయం

- తీవ్ర మనస్తాపానికి గురైన వలంటీర్లు
- కృష్ణగిరి, వెల్దుర్తిలో 94 మంది రాజీనామా
- మొబైల్ ఫోన్లు, డివైజ్‌లు వెనక్కి ఇచ్చిన స్వచ్ఛంద సేవకులు



వెల్దుర్తి ఎంపీడీఓకు రాజీనామా పత్రాలు సమర్పిస్తున్న వలంటీర్లు

కర్నూలు(అర్బన్): తెల్లవారకముందే అవ్వాతాతలను నిద్రలేపి నిస్వార్థంగా పెన్షన్లు అందిస్తున్న వలంటీర్ల సేవలను కూడా రాజకీయ స్వార్థం కబళించింది. నిరక్షరాస్యులైన తల్లిదండ్రుల పిల్లల ఉన్నత విద్యకు అవసరమైన సర్టిఫికెట్లను ఇంటి ముంగిట్లోకే అందిస్తున్న వారిపై కక్ష సాధింపు ప్రారంభమైంది. ప్రభుత్వం అందించే అనేక సంక్షేమ పథకాలను ఎలాంటి లాభాపేక్ష లేకుండా అర్హులైన పేద, మధ్య తరగతి మహిళలకు అందించేందుకు కృషి చేస్తున్న వీరిపై కరుణ చూపించాల్సింది పోయి కాఠిన్యాన్ని ప్రదర్శిస్తోంది. ప్రభుత్వం అందించే గౌరవ వేతనంతో తమకు కేటాయించిన 50 ఇళ్లలో వారు ఒక సభ్యులుగా ఉంటూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రజల తలలో నాలుకలా వ్యవహరిస్తున్న వలంటీర్లకు రాజకీయ రంగు అంటించారు. వలంటీర్లు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, వారిని ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని సిటిజన్స్ ఫోరం ఫర్ డెమోక్రసీ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు స్పందించింది. ఈ నేపథ్యంలోనే వారిని పింఛన్లు సహా అన్ని నగదు పంపిణీ ప్రయోజనాలకు దూరంగా ఉంచాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. దీంతో ఈ నెల 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమంతో పాటు మిగిలిన అన్ని కార్యక్రమాలకు వలంటీర్లు దూరంగా ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. సిటిజన్స్ ఫోరం ఫర్ డెమోక్రసీ సంస్థ వెనక తెలుగుదేశం పార్టీ నాయకులే ఉండి హైకోర్టులో పిటిషన్ వేయించారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

రాజీనామాల బాటలో ...

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న గౌరవ వేతనంతో స్వచ్ఛందంగా విధులు నిర్వహిస్తున్న వలంటీర్లపై అభాండాలు వేయడం, విధులకు దూరంగా ఉండాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేయడంపై వారు తీవ్ర మనస్తాపానికి గురవుతున్నారు. ఈ నేపథ్యంలోనే పలువురు రాజీనామాలకు సిద్ధమయ్యారు. సోమవారం కృష్ణగిరి మండలం చెరుకులపాడు గ్రామంలో 18 మంది, వెల్దుర్తిలో 76 మంది తమ వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేస్తున్నట్లు లిఖిత పూర్వకంగా ఎంపీడీఓలకు రాజీనామా లేఖలను అందించారు.

మొబైల్ ఫోన్లు అప్పగించాలని ఆదేశాలు

వలంటీర్లపై కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ప్రభుత్వం అందించిన మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డులను వెంటనే సంబంధిత ఎంపీడీఓలకు అప్పగించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. జిల్లాలో 29 క్లస్టర్లకు సంబంధించి 10,390 మొబైల్ ఫోన్లను అందించింది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సాయంత్రం 4.30 గంటల వరకు 7,192 ఫోన్లను సంబంధిత వలంటీర్లు తమ పరిధిలోని ఎంపీడీఓలకు అప్పగించారు. అలాగే డివైజ్‌లను గ్రామ/వార్డు సచివాలయాల్లో స్వాధీనం చేసే ప్రక్రియను చేపట్టారు.

భయపడుతున్నారు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన వలంటీరు వ్యవస్థను చూసి ప్రతిపక్షాలు భయపడుతున్నాయి. ఇన్ని రోజులు లేనిది ఇప్పుడు ఎన్నికల సమయంలో మాపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా వలంటీరుగా ఎప్పటిలాగే ప్రజలకు సేవలు అందిస్తాం.

– అనిల్, చెరుకులపాడు

రాజీనామాతో బుద్ధి చెబుతాం



మాపై తప్పుడు ఆరోపణలు చేస్తున్న వారికి మా రాజీనామాలతో బుద్ధి చెబుతాం. ఐదేళ్లు ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని కల్పించిన ముఖ్యమంత్రి జగనన్నకు రుణపడి ఉంటాం. ప్రజలకు సేవలు అందించడంలో చాలా తృప్తిని పొందాం. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశంతో మనో ధైర్యం పెరిగింది.

– వీరయ్య ఆచారి, కొసనాపల్లి

స్వచ్ఛందంగా సేవలు అందించాం



ప్రభుత్వం మాకు ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని కల్పించింది. మాకు కేటాయించిన కుటుంబాలకు స్వచ్ఛందంగా సేవలు అదించాం. ప్రభుత్వ పథకాలను అందించి అవసరమైన సేవలను చేశాం. ఎన్నికల సమయంలో మమ్మల్ని దూరం పెట్టాలని చూస్తున్నారు. అందుకే మేమే స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నాం. – ప్రేమ్‌కుమార్, చెరుకులపాడు

బాధ కలిగించింది

నాలుగున్నరేళ్ల పాటు నిస్వార్థంగా సేవలు అందించాం. ఎలాంటి అవినీతి, అక్రమాలకు పాల్పడ లేదు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి సేవలు చేశాం. రాజకీయాలు, కులమతాలకు అతీతంగా ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు అందించాం. మాపై టీడీపీ, జనసేన నేతలు ఎప్పుడూ విషం చిమ్ముతూనే ఉన్నారు. ఎన్నో అభాండాలు వేశారు. చివరికి సంక్షేమ పథకాల అమలుకు దూరం చేయడం బాధ కలిగించింది. వలంటీర్ల సేవలను గుర్తించకుండా బురద చల్లడం దారుణం.

– విజయ్ రాజ్‌కుమార్, లక్ష్మీనగర్, కర్నూలు

'పది' పరీక్షల మూల్యాంకనం ప్రారంభం

కర్నూలు సిటీ: పదో తరగతి పరీక్షలు ముగియడంతో జిల్లా పరీక్షల విభాగం ఆధ్వర్యంలో సోమవారం మూల్యాంకనం ప్రారంభమైంది. ఏ క్యాంపు మాంటిస్సోరి స్కూల్‌లో మూల్యాంకన క్యాంపును డీఈఓ శామ్యూల్, జిల్లా పరిశీలకులు కె.గీత ప్రారంభించారు. జిల్లాకు 1,84,267 సమాధాన పత్రాలు వచ్చాయి. వీటిని మూల్యాంకనం చేసేందుకు అసిస్టెంట్ ఎగ్జామినర్లు 598, చీఫ్ ఎగ్జామినర్లు 99, స్పెషల్ అసిస్టెంట్లు 200 మందిని నియమించారు. అయితే కొంత మంది ఉపాధ్యాయులు చిన్న చిన్న కారణాలను చూపించి అసిస్టెంట్ ఎగ్జామినర్ విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులతో కలిసి క్యాంపు కేంద్రం దగ్గరకు గుంపులుగుంపులుగా వచ్చారు. దీంతో అధికారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్డరు పొందిన వారు సరైన కారణం చూపకుండా గైర్హాజరైతే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మూల్యాంకనం మొదలైన తరువాత మినహాయింపులపై ఉపాధ్యాయ సంఘాల నాయకుల వినతులను తీసుకున్నారు. ఎన్నికల శిక్షణ, మూల్యాంకనం ఒకే రోజున మొదలు కావడంతో ఉదయం హాజరుకాలేకపోయిన వారు సాయంత్రం విధుల్లో చేరారు. మొదటి రోజున ఏఈలు 500 మంది, సీఈలు 99, స్పెషల్ అసిస్టెంట్స్ 200 మంది విధుల్లో చేరారు. సోషల్‌కు ఏఈలు, హిందీ సబ్జెక్టుకు అసిస్టెంట్ ఎగ్జామినర్ల కొరతఉండడంతో ఆసక్తి ఉండే వారికి ఆర్డర్లు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 8వ తేదీ నాటికి పదో తరగతి మూల్యాంకనం పూర్తి కావాలని పరీక్షల విభాగం ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చారు.



మూల్యాంకన కేంద్రం దగ్గర ఉపాధ్యాయులు

నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణ

- పీఓ, ఏపీఓల శిక్షణలో జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన



శిక్షణ జరుగుతున్న విధానాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించాలని పీఓలు, ఏపీఓలను జిల్లా ఎన్నికల అధికారి/జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. సోమవారం ఎమ్మార్సీ కన్వెన్షన్ సెంటర్‌లో కోడుమూరు, ఆదోని, పాణ్యం, కర్నూలు నియోజకవర్గాల పీఓలు, ఏపీఓలకు ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు. హ్యాండ్స్ ఆన్ ట్రెనింగ్ పేరుతో ఇచ్చిన శిక్షణలో పోలింగ్ రోజున విధులు ఎలా నిర్వహిస్తారో అదే విధంగా మాస్టర ట్రెనర్లతో శిక్షణ ఇప్పించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 17సీ, పీఓ డైరీ, పీఓ రిపోర్టుల తోపాటు ఈవీఎంఎం కనెక్షన్‌పై స్పష్టమైన అవగాహన ఉండాలన్నారు. ఈవీఎంలు సరిగా పనిచేయకపోతే కంగారు పడి ఇబ్బందులు పడకుండా ముందుగా అన్ని రకాలుగా అవగాహన పెంచుకోవాలన్నారు. ఎలాంటి సందేహాలు ఉన్నా నిపుణులను అడిగి తెలుసుకోవాలన్నారు. మే 13న పోలింగ్ ఉంటుందని, దాని ముందు రోజునే పోలింగ్ మెటీరియల్ మొత్తం వచ్చిందో లేదో సరి చూసుకున్న తరువాతే కేంద్రానికి వెళ్లాలన్నారు. పీఓలకు మొత్తం మూడు రకాలుగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని, ప్రస్తుతం నిర్వహించే శిక్షణను మొదటి దశగా పరిగణిస్తున్నట్లు చెప్పారు. పీఓ, ఏపీఓలను వారి సొంత నియోజకవర్గంలో విధులకు కేటాయించబోమని, సమీపంలోని నియోజకవర్గంలో విధులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వివిధ విభాగాలపై పీఓలు, ఏపీఓలకు జేసీ నారపురెడ్డి మౌర్య, కర్నూలు నగరపాలకసంస్థ భార్గవ్‌తేజ, ఆదోని సబ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ, పత్తికొండ ఆర్‌డీఓ రామలక్ష్మి, కర్నూలు ఆర్‌డీఓ ఎం.శేషిరెడ్డి శిక్షణ ఇచ్చారు.

ఉగాది మహోత్సవాలకు మెరుగైన ఏర్పాట్లు

- భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు
- నంద్యాల జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు



సమీక్షలో మాట్లాడుతున్న నంద్యాల జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు

నంద్యాల: శ్రీశైల మహాపుణ్య క్షేత్రంలో ఈనెల 6 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించే ఉగాది మహోత్సవాలకు తరలివచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు దేవస్థానం, సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఉగాది మహోత్సవాలపై జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎలాంటి చిన్న సంఘటనలకు తావివ్వకుండా శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది మహోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలన్నారు. వేసవి ఉష్ణోగ్రతలు రోజురోజుకు తీవ్రతరమవుతున్న నేపథ్యంలో కర్ణాటక నుంచి వచ్చే కన్నడ భక్తులు వడదెబ్బకు గురి కాకుండా అన్ని రకాల ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని ఎంట్రీ పాయింట్ నుండి శ్రీశైలం చేరే వరకు అవసరమైన అన్ని ప్రాంతాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. వెంకటాపురం నుంచి శ్రీశైలం వరకు వచ్చే పాదయాత్ర భక్తులకు అటవీ మార్గంలో గుర్తించిన మార్గమధ్యలో 13 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన మందులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ హటకేశ్వరం వద్ద ఉన్న దుకాణాలను వెనక్కి తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులు క్యూలైన్లలో దూసుకోకుండా మెస్ ఎత్తును పెంచాలని దేవస్థానం ఈవోకు సూచించారు. జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తాగునీటి కోసం దేవస్థాన పరిధిలో ఏర్పాటుచేసిన సింటెక్స్ ట్యాంకుల వద్ద భక్తులు స్నానాలు చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తుల రద్దీ కనుగుణంగా మొబైల్ టాయిలెట్లు, షవర్ బాతులు ఏర్పాటు చేయాలన్నారు. భక్తులెవరూ బహిర్భూమికి వెళ్లకుండా దేవస్థాన పరిపాలన సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం దేవస్థాన కార్యనిర్వహణాధికారి పెద్దిరాజు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఉగాది ఉత్సవాల కోసం చేస్తున్న ఏర్పాట్లను వివరించారు. సమావేశంలో డీఆర్‌ఓ పద్మజ, డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ పాల్గొన్నారు.

'మండే' ఎండలు!



- రాష్ట్రంలోనే ఉమ్మడి కర్నూలు జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు
- బనగానపల్లిలో 43.48 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

కర్నూలు(అగ్రికల్చర్): వేసవి తీవ్రత పెరుగుతుండటంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. రాష్ట్రంలోనే ప్రధానంగా కర్నూలు జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటం గమనార్హం. ఉదయం 10 గంటలకే మొదలైన వడగాలులు తీవ్రత సాయంత్రం 7 గంటల వరకు తగ్గని పరిస్థితి. ఏప్రిల్ నెల మొదటి రోజునే భానుడు విజృంభించాడు. రానున్న రోజుల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని ఇప్పటికే రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు ప్రకటించారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో బనగానపల్లిలో రాష్ట్రంలోనే అత్యధికంగా 43.48 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పాణ్యం మండలం గోనవరంలో 43.26, గూడూరులో 43.18, నందికొట్కూరు మండలం బ్రాహ్మణకోట్కూరులో 43.13, మహానందిలో 43.01, మంత్రాలయం మండలం వగరూరులో 43.0, హొళగుందలో 42.96 డిగ్రీల ప్రకారం ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇవన్నీ రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలే కావడం గమనార్హం. రానున్న నాలుగైదు రోజులు కూడా ఎండలు, వడగాలుల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ ప్రకటించింది.

క్లుప్తంగా

భూమా అఖిలప్రియపై కేసు నమోదు

ఉయ్యాలవాడ: సార్వత్రిక ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా కోడ్ ఉల్లంఘించిన ఆళ్లగడ్డ టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియపై ఉయ్యాలవాడ పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదయింది. ఎస్ఐ రామాంజనేయులురెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మార్చి 28వ తేదీన ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఉదయం 11.30 గంటల నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు టీడీపీకి అనుమతులు ఇచ్చారు. అయితే ఇందుకు భిన్నంగా అదే రోజు రాత్రి 8.15 నుంచి 9.00 గంటల వరకు స్థానిక బస్టాండు నుంచి డప్పుల మోతతో టీడీపీ నాయకులు బోరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఇంటి వరకు అనుమతి లేకుండా భూమా అఖిలప్రియ ర్యాలీ నిర్వహించారు. మోడల్ కండక్ట్ నిర్వహణ అధికారి రఘురాం ఫిర్యాదు మేరకు ఆమెపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ స్పష్టం తెలిపారు.

ఆర్‌యూ ప్రొఫెసర్ ఎస్తేర్ రాణిపై విచారణ

కర్నూలు కల్చరల్: ఆర్‌యూ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్, కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ నిధుల గోల్‌మాల్‌కు పాల్పడి సస్పెన్షన్‌లో ఉన్న వర్సిటీ ప్రొఫెసర్ ఎం.ఇ.ఎస్తేర్ రాణిపై సోమవారం వర్సిటీలో విచారణ జరిగింది. నెల్లూరు విక్రమసింహపురి యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రారెడ్డి, రాయలసీమ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ నాగుల అంకన్న, వర్సిటీ ఫైనాన్స్ ఆఫీసర్ కొడాలి భవాని శంకర్‌లతో కూడిన కమిటీ ఈ విచారణ చేపట్టింది. ప్రొఫెసర్ రాణి విచారణ కమిటీ ముందు హాజరై వారు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. తర్వాత నివేదికను సీల్డ్ కవర్‌లో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్‌కు, రాయలసీమ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బి.సుధీర్‌కుమార్‌కు అందజేశారు. రెండు మూడు రోజుల్లో కమిటీ రిపోర్ట్ బయటికి వస్తుందని, దానిని బట్టి చర్యలు తీసుకుంటామని వీసీ పేర్కొన్నారు.

శిక్షణకు గైర్హాజరైన అధికారులకు నోటీసులు

కర్నూలు (సెంట్రల్): మార్చి 30, ఏప్రిల్ 1వ తేదీన ఎంఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఎన్నికల విధుల నిర్వహణ శిక్షణకు హాజరుకాని పీఓలు, ఏపీఓలకు జిల్లా ఎన్నికల అధికారి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. మార్చి 30వ తేదీన 44 మందికి, ఏప్రిల్ 1వ తేదీన జరిగిన శిక్షణకు హాజరు కాని 26 మందికి మొత్తం 70 మందికి నోటీసులు ఇచ్చి ఎందుకు హాజరు కాలేదో మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని అందులో పేర్కొన్నారు.

హెచ్‌టీ విత్తనాల ఏరివేతపై దృష్టి

- కాటన్ సీడ్ ప్రాసెసింగ్ యూనిట్లలో ముమ్మరంగా తనిఖీలు



హెచ్‌టీ పత్తి విత్తనాలను గుర్తించేందుకు పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ శాఖ కమిషనరేట్ నుంచి వచ్చిన ప్రత్యేక టీమ్ కర్నూలు నగరంలోని పలు కాటన్ సీడ్ ప్రాసెసింగ్ యూనిట్లలో తనిఖీలు నిర్వహించింది. ప్రధానంగా పత్తిలో హెచ్‌టీపై ఈ టీమ్ దృష్టి సారించింది. హెచ్‌టీ కాటన్ విత్తనాలకు ఎలాంటి అనుమతులు లేవు. అయితే, అక్కడక్కడ హెచ్‌టీ పత్తి సాగు చేస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. హెచ్‌టీ పత్తి సాగు జీవ వైవిధ్యానికి, పర్యావరణానికి తీవ్రంగా హాని చేస్తాయనే ఉద్దేశంతో అనుమతి ఇవ్వలేదు. కమిషనరేట్ నుంచి వచ్చిన ప్రత్యేక టీమ్ ఏపీ సీడ్స్ సుదర్శన్ రాజు, ఏడీ శివశంకర్ సోమవారం పలు పత్తి విత్తన కంపెనీల్లో తనిఖీలు చేపట్టారు. శ్రీరామ సీడ్స్, కర్నూలు సీడ్స్, సహజ క్రాప్ సైన్స్, మహాలక్ష్మి కాటన్‌సీడ్స్, సూపర్ సీడ్స్ కంపెనీల్లో హెచ్‌టీ పరీక్షలు నిర్వహించారు. ఈ కంపెనీల్లో అక్కడక్కడ 50 శ్యాంపుల్స్ తీసి పరీక్షలు నిర్వహించారు. అయితే హెచ్‌టీ ఉన్నట్లు నిర్ధారణ కాలేదు. అన్ని శ్యాంపుల్స్ నెగిటివ్ వచ్చాయి. టీమ్ ప్రతినిధుల వెంట కల్లూరు మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస రెడ్డి కూడా ఉన్నారు.



పల్లకీతో శ్రీశైలం వెళ్తున్న కన్నడిగులు



భజన చేస్తూ మల్లన్న చెంతకు..



కావడి మోస్తూ..



డప్పు కొట్టుకుంటూ..



కాళ్లకు కర్రలు కట్టుకుని పయనం



శరణమప్ప శివప్ప

శ్రీశైల భ్రమరాంబికను కన్నడ ప్రాంత వాసులు తమ ఆడపడుచుగా భావిస్తారు. ఉగాది పండుగకు అమ్మవారికి సారె సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. కర్ణాటక రాష్ట్రం బళ్లారి, రాయచూరు, గడేకల్లు, పెంచర్లపాడు, దోనేకల్లు, చేవిదుర్గి, అగిరి, జోజరాశి, పర్వదేమనల్లి, కక్కబేవదల్లి, కమ్మరచేడు గ్రామాల మీదుగా వీరు కాలినడక 400 కిలోమీటర్ల దూరం ప్రయాణించి శ్రీశైలం చేరుకుంటారు. వీరి భక్తికి మండే ఎండలు సైతం చిన్నబోవాల్సిందే! కొందరు పొడవాటి కర్రలను కాళ్లకు కట్టుకుని .. మరికొందరు చిన్న పల్లకీని భుజాన ధరించి నడుస్తున్నారు. ఇంకొందరు అఖండ దీపాలను శ్రీగిరికి తీసుకెళ్తూ కనిపించారు.

– సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు



ఆటోపై శివలింగంతో..



అడుగడుగునా భక్తి పారవశ్యం



గార్గేయపురం చెరువు వద్ద స్నానం చేస్తూ..



జొహరాపురంలో భక్తులకు అన్నదానం



లారీలో పిల్లాపాపలతో శ్రీగిరికి..

క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకుడి అరెస్ట్

- రూ.3 లక్షలు నగదు, రెండు సెల్‌ఫోన్‌లు, 5 లీటర్ల నాటుసారా స్వాధీనం

ఆదోని అర్బన్: పట్టణ శివారులోని ధణాపురం గ్రామ సమీపంలో నాటుసారా అమ్ముతూ ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. రూ.3 లక్షలు నగదు, రెండు సెల్‌ఫోన్లు, 5 లీటర్ల నాటుసారాయిని స్వాధీనం చేసుకున్నారు. స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ శివనారాయణస్వామి వివరాలు వెల్లడించారు. బోయగేరికి చెందిన బోయ కుంటి ఆంజనేయులు నాటుసారా అమ్ముతుండేవాడు. ఐపీఎల్ క్రికెట్ జరుగుతుండడంతో అందులో భాగంగా సోమవారం ముంబాయి వర్సెస్ రాజస్థాన్ ఆటకు సంబంధించి క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నాడు. పక్కా సమాచారం మేరకు పట్టణ సమీపంలోని ధణాపురం శివారులో పాడుపడిన ఇందిరమ్మ గృహాల వద్ద బోయ కుంటి ఆంజనేయులను సీఐలు తేజోమూర్తి, గోపీ, నరసింహరాజు, నిరంజన్ రెడ్డి అరెస్ట్ చేశారు. బెట్టింగ్‌లో మరికొంతమంది ఉండడంతో వారిపై కూడా కేసు నమోదు చేశామని డీఎస్పీ తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివనారాయణస్వామి

జవహర్ నవోదయ ఆరో తరగతి ప్రవేశ పరీక్షా ఫలితాలు విడుదల

ఎమ్మిగనూరు రూరల్: మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరవ తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన ఫలితాలను విడుదల చేసినట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ ఇ.పద్మావతి సోమవారం రాత్రి ఓ ప్రకటనలో తెలిపారు.

ఐ1089741	ఎస్1091314	జె1091503
ఎం1091511	కె1093024	జె1094342
కె1094536	జె1089610	ఎస్1089751
ఎస్1090029	జె109269	ఎఫ్1093950
ఓ1091304	కె1091906	ఓ1092626
కె1094865	ఐ1090927	జె1091260
బి1092566	ఎల్1093626	జె1088970
జె1088988	ఎస్1089197	జె1089224
జె1089434	జె1089821	ఐ1090039
ఎం1090209	జె1090548	ఎం1090996
ఎస్1091226	జె1091236	ఎస్1091351
ఎం1091536	జె1091703	జె1091969
జె1092815	జె1092873	ఎం1093047
ఐ1093170	జె1093478	కె1093504
జె1093703	ఎస్1093824	జె1093917
ఐ1094250	ఎం1094733	జె1090261
జె1090270	జె1090320	జె1090335
ఎస్1090417	జె1090443	ఎస్1090491
జె1090574	ఎస్1091014	ఎస్1091589
జె1091659	జె1091662	జె1091699
జె1091988	జె1092700	ఎస్1094387
కె1089207	కె1089899	ఓ1090351
కె1090476	కె1090994	ఓ1091444
జె1091964	కె1091980	కె1093032
ఓ1093803	కె1094633	పి1090497
పి1090645	ఎల్1090701	ఎల్1090825
పి1093774.		

నల్లమల ఘాట్‌లో ట్రాఫిక్ జామ్

- అర్ధరాత్రి తర్వాత రాకపోకలు

మహానంది: నంద్యాల నుంచి గిద్దలూరు వెళ్లే నల్లమల ఘాట్‌రోడ్డులో గుంటూరు వైపు నుంచి మిర్చి లోడుతో వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తూ సోమవారం సాయంత్రం 5.30 గంటల సమయంలో రక్షణగోడను ఢీకొట్టింది. దీంతో లారీ రోడ్డుపైనే నిలిచిపోయి వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. అసలే మండుటెండలు, ఆపై నల్లమల కావడంతో తాగడానికి మంచి నీళ్లు సైతం లేక అల్లాడిపోయారు. రహదారిపై నిలిచిన లారీని పక్కకు తప్పించేందుకు రోడ్‌సేఫ్టీ పోలీసులు ఘటనా స్థలానికి తీసుకెళ్లిన క్రేన్ మరమ్మతుకు గురికావడంతో మరో క్రేన్ కోసం నంద్యాలకు వెళ్లి తీసుకొచ్చేసరికి ఆలస్యమైంది. సోమవారం అర్ధరాత్రి తర్వాత వాహనాన్ని పక్కకు తీశారు. దీంతో వాహనాల రాకపోకలు యథావిధిగా కొనసాగాయి.



రక్షణ గోడను ఢీకొట్టిన లారీ

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

- మరో ఇద్దరి పరిస్థితి విషమం

మంత్రాలయం: రచ్చమర్రి సమీపంలోని విజయదుర్గ ఆలయం వద్ద ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృత్యువాత పడగా మరో ఇద్దరు తీవ్ర గాయాల పాలయ్యారు. ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపిన వివరాలకు మేరకు.. కోసిగిలోని సిద్ధపాశెం ప్రాంతానికి చెందిన శ్రీనివాస ఆచారి, ఈశ్వరమ్మ రెండో కుమారుడు మానేష్ ఆచారి కర్ణాటకలోని రాయచూరులో బంగారుషాపులో కంసలి పని చేస్తున్నారు. ఆదివారం సెలవుకావడంతో స్నేహితులు సూరిపోగు ఉరుకుంద, శ్రీకాంత్ ఆచారితో కలిసి సొంత పనుల నిమిత్తం మోటార్ సైకిల్‌పై రాయచూరు వెళ్లారు. ఆదివారం రాత్రి బైకుపై వేగంగా తిరిగి వస్తూ ప్రమాదానికి గురయ్యారు. మానేష్ ఆచారి అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. సూరిపోగు ఉరుకుంద కోమాలోకి వెళ్లగా కర్నూలు పెద్దాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మరో యువకుడి పరిస్థితి కూడా విషమంగా ఉందని బంధువులు తెలిపారు. మానేష్ ఆచారికి ఏడాది క్రితం పెళ్లి జరిగింది. మానేష్ మృతదేహానికి ఆదోని ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. అనుకోకుండా చిన్నకుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.



మృతుడు మానేష్ ఆచారి (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

డోన్ రూరల్ : డోన్ – రాయలచెరువు రహదారిలో గోసానిపల్లి గ్రామ సమీపంలో సోమవారం ఆటో, కారు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఊటకొండ గ్రామానికి చెందిన వెంకటేశ్వరరావు(45), సురేష్ ఇంటి నిర్మాణానికి అవసరమైన సిమెంట్ కోసం ఆటోలో డోన్ పట్టణానికి వచ్చారు. సిమెంట్ వేసుకొని తిరిగి వెళ్తుండగా గోసానిపల్లి గ్రామం వద్ద ఎదురుగా డోన్ వైపు వస్తున్న కారు ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటేశ్వరరావు అక్కడికక్కడే మృతిచెందగా, గాయపడిన సురేష్, ఆటో డ్రైవర్ మంజునాథ్‌ను డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. అలాగే కారులో ఉన్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. మృతదేహాన్ని డోన్ ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. మృతునికి భార్య లక్ష్మీదేవి, కూతురు, కొడుకు ఉన్నారు. రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆశాజనకంగా ఎండుమిర్చి ధరలు

నంద్యాల(సెంట్రల్): పట్టణంలోని మిర్చి యార్డులో ఎండుమిర్చి ధరలు సోమవారం ఆశాజనకంగా ఉన్నాయి. సూపర్–10 సరకు రకం అమ్మకానికి వచ్చాయి. సూపర్–10 రకం జనరల్ క్వింటాలు గరిష్ట ధర రూ.14,300, మధ్యస్థ ధర రూ.12,900, కనిష్ట ధర రూ.12,000 గా నమోదైంది. ఇదే రకం తాలుకాయ జనరల్ గరిష్ట ధర క్వింటాలు రూ.6,200, మధ్యస్థ ధర రూ.5,500, కనిష్ట ధర రూ.4,500 గా పలికినట్లు యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శి కల్పన ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా యార్డులోని ధ్రువీకృత వ్యాపారస్తుల వద్ద సరకు అమ్ముకొని మంచి ధరను పొందాలని సూచించారు.

కాలినడక భక్తులు జాగ్రత్తలు తీసుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): కాలినడకన శ్రీశైలం వెళ్లే భక్తులు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ సూచించారు. సోమవారం ఆయన గోకులపాడులో ఏర్పాటు చేసిన శిబిరాన్ని సందర్శించి భక్తులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కర్ణాటక, మహారాష్ట్రల నుంచి దీక్షతో 600 నుంచి 800 కి.మీ దూరం పాదయాత్ర చేస్తూ భక్తులు శ్రీశైలం చేరుకుంటారన్నారు. వీరందరినీ అతిథులుగా భావించి అన్నదానం కార్యక్రమాలు విరివిగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ఎండాకాలం అయినందున భక్తులకు పరిశుభ్రమైన నీటిని అందించాలన్నారు. కలుషితం కాకుండా చెంబులు, గ్లాసులు, మగ్గులు తాగు నీటిలో ముంచరాదన్నారు. శుభ్రమైన పాత్రలలో తాగునీటిని ఏర్పాటు చేసి వాటికి కుళాయి బిగించి వాడాలని సూచించారు. అవకాశం ఉంటే దాతల సహకారంతో మినరల్ వాటర్ ప్యాకెట్లు అందించాలన్నారు. వేడి వేడి ఆహార పదార్థాలు మాత్రమే భక్తులకు వడ్డించాలని దాతలకు సూచించారు. భక్తులు వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిమ్మరసం, చక్కెర నీళ్ల ద్రావణం, మజ్జిగలో కొద్దిగా ఉప్పు కలిపి ఇవ్వాలన్నారు. ఎండలో నడిచే భక్తులు తలపై టోపీ గాని, టవల్ గానీ ధరించాలన్నారు. వడదెబ్బ తగిలితే సత్వర చికిత్స కోసం 108 అత్యవసర సేవలను సంప్రదించాలన్నారు.



భక్తులకు సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌ఓ ప్రవీణ్‌కుమార్

కూలి పనులకు వెళ్తూ మృత్యువాత

చిప్పగిరి: ఆటోలో నుంచి పడి ఓ మహిళ మృతి చెందింది. ఈ ప్రమాదం సోమవారం చిప్పగిరిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆదోని మండలంలోని చాగి గ్రామానికి చెందిన లక్ష్మి చిప్పగిరిలోని పొలాల్లో మిరప పంట కోయడానికి తమ గ్రామ కూలీలతో కలసి ఆటోలో వచ్చింది. పొలం దూరంగా ఉండడంతో చిప్పగిరి గ్రామానికి చెందిన మరో ఆటోలో పొలానికి వెళ్తుండా అందులో నుంచి కిందపడి మృతి చెందింది. మృతురాలికి భర్త బసవరాజు, ముగ్గురు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహమ్మద్ రిజ్వాన్ తెలిపారు.



మృతి చెందిన లక్ష్మి

